క్లుప్తంగా

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

ఎర్రగుంట్ల : చిన్నదండ్లూరు గ్రామ పంచాయతీలోని మేకలబాలాయపల్లి గ్రామంలో సోమవాం సాయంత్రం 3 గంటలకు నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి పాల్గొటారని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి ఎం.సురేంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

పులివెందుల రూరల్ : మండలంలోని అచ్చివెళ్లి గ్రామ సమీపంలో వెలసిన గంగమ్మతల్లి ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు తెలిపారు. అలాగే అమ్మవారి గ్రామోత్సవంలో చెక్కభజన కార్యక్రమం ఉంటుందన్నారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

మొక్కల ఆరోగ్య నిర్వహణ శిక్షణకు ఏఓ ఎంపిక

ముద్దనూరు : జాతీయ మొక్కల ఆరోగ్య నిర్వహణ సంస్థ నిర్వహించే శిక్షణలో మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణారెడ్డి పాల్గొనున్నారు. ఈనెల 8వ తేదీ నుంచి12వ తేదీ వరకు 5 రోజుల పాటు హైదరాబాదులోని ఎన్ఐపీహెచ్‌ఎంలో శిక్షణకు వెళ్తున్నట్లు ఏఓ తెలిపారు. క్షేత్ర నిర్వహణ, ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాగుచేసిన పంటల్లో పరాన్నజీవులు, మొక్క, నులిపురుగుల ఆవశ్యకత తదితర అంశాల్లో శిక్షణకు తాను హాజరవుతున్నట్లు ఏఓ తెలిపారు.

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ట వేడుకలు



కోదండరామస్వామి ఆలయం

లింగాల : మండలంలోని మురారిచింతల గ్రామంలో నూతనంగా పునఃనిర్మించిన కోదండ రామస్వామి ఆలయంలో నూతన దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ట వేడుకలు సోమవారం నుంచి బుధవారం వరకు మూడు రోజులపాటు నిర్వహిస్తున్నామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి సహకారంతో నిర్వహించనున్నామన్నారు. పురోహితులు వెల్లాల రామప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో సోమవారం ఉదయం గోపూజ, గణపతి పూజ, యాగశాల ప్రవేశం, యంత్ర ప్రతిష్ఠ, యంత్రాభిషేకం, రక్షా బంధన్ కార్యక్రమాలు, తీర్థ ప్రసాదాల వినియోగం నిర్వహిస్తామన్నారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ శేషఫణి

వేంపల్లె : పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ఆదివారం ఆర్యవైశ్య ఆఫీసియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(ఆవోపా) ఆధ్వర్యంలో ఉచిత హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరానికి కడపకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ క్రిష్టిపాటి శేషఫణి 112 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య కమిటీ చైర్మన్ పి.సాయి సత్యనారాయణ, అధ్యక్షుడు గోవర్ధన్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వకవి ఠాగూర్‌కు ఘన నివాళి



ఠాగూర్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న పెన్షనర్ల సంఘం నాయకులు

కడప ఎడ్యుకేషన్: భారతదేశానికి జాతీయ గీతాన్ని అందించిన గొప్ప మానవతావాది రవీంద్రనాథ్‌ఠాగూర్ అని పెన్షనర్ల సంఘం జిల్లా కార్యదర్శి రామమూర్తినాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగమునిరెడ్డి అన్నారు. విశ్వకవి రవీంద్రనాథ్‌ఠాగూర్ జయంతిని ఆదివారం కడప పెన్షనర్ల సంఘం కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం నాయకులు నారాయణరెడ్డి, రాముడు, నాగయ్య, నారాయణ, పలువురు నాయకులు, రాయల్ రషీద్ పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి జాతర

చాపాడు : మండల పరిధిలోని మొర్రాయిపల్లె గ్రామంలో ఆదివారం ఘనంగా పెద్దమ్మ తల్లి జాతరను ఘనంగా నిర్వహించారు. ప్రజలందరూ సంయుక్తంగా పెద్దమ్మకు బోనాలు సమర్పించారు. అలాగే ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరికీ మంచి జరగాలని, రైతులు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారికి పూజలు నిర్వహించినట్లు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో యల్లమ్మ జాతర



చెన్నూరులో పోతులూరి అయ్యస్వామి ఊరేగింపు



జమ్మలమడుగులో కల్పవృక్ష వాహనంపై నారాపురస్వామి



చింతకొమ్మదిన్నెలో ప్రత్యేక పూజలందుకుంటున్న గంగమ్మతల్లి



కమలాపురం : హారతి అందుకుంటున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : చెన్నూరులో యల్లమ్మ జాతరను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు ఆధ్వర్యంలో వివిధ పూజలు చేపట్టారు. పోతులూరి అయ్యస్వామి ఊరేగింపు ప్రశాంతంగా ముగిసింది. ఆదివారం సాయంత్రం మూడు గంటల నుంచి చెన్నూరులోని ఆంజనేయ స్వామి గుడి దగ్గర నుంచి పోతులూరి అయ్యాస్వామిని ట్రాక్టర్‌పై ఊరేగించారు, ఊరేగింపు పార్క్ వీధి నుంచి పాత బస్టాండ్ శివాలయం, తహసీల్దార్ కార్యాలయం, పోలీస్‌స్టేషన్ మీదుగా కొనసాగింది, జాతరను డీఎస్పీ మహమ్మద్ షరీఫ్ పర్యవేక్షించారు. చెన్నూరు ఎస్ఐ శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షణలో విస్తృత బందోబస్తు ఏర్పాటు చేశారు. ఊరేగింపులో శాంతి కమిటీ సభ్యులు, పలువురు ప్రజా ప్రతినిధులు, అన్ని పార్టీలకు చెందిన రాజకీయ నాయకులు పాల్గొన్నారు. యల్లమ్మ జాతరలో భాగంగా నిర్వాహకులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి జాతర అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో వైఎస్సార్సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్, ఎంపీటీసీలు ముదిరెడ్డి సుబ్బారెడ్డి, ఎర్రసాని నిరంజన్‌రెడ్డి, దుంపనాగిరెడ్డి, గొర్ల పుల్లయ్య ఓబుల్‌రెడి, వైఎస్సార్ సీపీ నాయకులు ఆకుల ప్రసాద్‌బాబు, టిఎస్ చంద్రారెడ్డి, పాలగిరి ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి విశేషపూజలు

చింతకొమ్మదిన్నె : కొత్తపేట-బుగ్గలేటిపల్లి సరిహద్దుల్లోని గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలతో పాటు అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పట్టు వస్త్రాలతో అమ్మవారిని అలంకరించారు. కోర్కెలు తీరిన భక్తులు అమ్మవారికి ముద్దలను ఏర్పాటు చేసి ఆభరణాలను, పట్టు వస్త్రాలను కానుకలుగా సమర్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ చైర్మన్ పార్వతమ్మగారి విశ్వనాథ్‌రెడ్డి, ఆలయ కార్య నిర్వహణ అధికారి సురేష్ కుమార్‌రెడ్డి ఏర్పాట్లు చేశారు. ఆలయ ఆవరణలోని బంధుమిత్రులతో విందుభోజనాలను ఆరగించారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు

కమలాపురం : మండల పరిధిలోని రామాపురంలో వెలసిన మోక్ష నారాయణస్వామి ఆలయంలో ఈనెల 3వతేదీ నుంచి జరుగుతున్న బ్రహ్మోత్సవాలు ఆదివారం ముగిసాయి. ప్రముఖ వేద పండితులు ఘనాపాటి వంశీకృష్ణ ఆచారత్వమున ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. సాయంత్రం మోక్ష నారాయణుడు గరుడ వాహనంపై, సుబ్రహ్మణ్యస్వామి మయూర వాహనంపై మాడ వీధులతో ఊరేగారు. నిర్వాహకులు సాయినాథ శర్మ పెద్ద ఎత్తున అన్నదానం ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డి తదితరులు స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు :

వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 8 జతల కాండ్లు రాతి దూలాన్ని ఈడ్చాయి. గెలుపొందిన విజేతలకు వరుసగా రూ.50వేలు, రూ.40వేలు, రూ. 30వేలు. రూ.20వేలు, రూ.10వేలు, రూ.5వేల నగదు బహుమతులను అందజేశారు.

కల్పవృక్ష వాహనంపై నారాపురస్వామి

జమ్మలమడుగు : నారపురస్వామి బ్రహోత్సవాలు కనులవీందుగా జరుగుతున్నాయి. భక్తులకు దేవదేవుడి ప్రతి రోజు ఒక అలంకారంతో దర్శనం ఇస్తూ కనువిందు చేస్తున్నారు. ఆదివారం ఉదయం కల్పవృక్ష వాహనంపై స్వామివారికి గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు స్వామివారికి హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. మంగళవారం స్వామి వారికి కల్యాణోత్సవం బుధవారం ఉదయం రథోత్సవం నిర్వహించనున్నారు.

నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లా వ్యాప్తంగా వివిధ పంటలు దెబ్బతిని జిల్లా రైతాంగం కష్టాల పాలైందని, ప్రభుత్వం వెంటనే నష్టపరిహారం అందించాలన్న ఉద్దేశ్యంతో సోమ వారం ఉదయం కలెక్టరేట్ ఎదురుగా రైతులతో కలిసి శాంతియుతంగా ధర్నా నిర్వహిస్తున్నామని బీజేపీ జిల్లా అధ్యక్షుడు యల్లారెడ్డి తెలిపారు. బీజేవైఎం ఆధ్వర్యంలో జరిగే ఈ ధర్నాకు బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు వంగల శశిభూషణ్‌రెడ్డి, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సురేష్‌రెడ్డి, రాష్ట్ర స్థాయి నాయకులు పాల్గొంటారన్నారు.

నేడు జాన్ హెంగ్రీ డ్యూనాంట్ జయంతి

కడప కల్చరల్ : ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ వ్యవస్థాపకులు జాన్ హెంగ్రీ డ్యూనాంట్ జయంతి వేడుకలను సోమవారం కడప నగరంలోని మట్టిపెద్దపులి వీధివద్దగల రెడ్‌క్రాస్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు సంస్థ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తేజ తెలిపారు. ఉదయం 9.00 గంటలకు కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపకుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నట్లు తెలిపారు. ఉదయం 10.00 గంటలకు మరియాపురం వద్దగల ఎస్టీ వెల్ఫేర్ హాస్టల్ విద్యార్థులకు ఉచితంగా బ్లడ్ గ్రూపింగ్ క్యాంపు నిర్వహిస్తామన్నారు. సంస్థ స్పెషల్ ఆఫీసర్ సి.సాయిగ్రేస్ ముఖ్య అతిథిగా హాజరై ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రక్తదానం చేయదలిచిన వారు స్వచ్ఛందంగా సంస్థ కార్యాలయానికి రావా లని ఆయన సూచించారు.

శిల్పారామంలో సండే సందడి





నృత్య ప్రదర్శనలో చిన్నారులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక శిల్పారామంలో ఆదివారం సాయంత్రం విజయవాడ ఎక్స్‌లెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. డ్యాన్స్ మాస్టర్ చిట్టి ఆధ్వర్యంలో చిన్నారుల జానపద, వెస్ట్రన్ నృత్య ప్రదర్శనలు అలరించాయి. చిన్నారుల నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. శిల్పారామ ఏఓ సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

కడప వైఎస్ఆర్ సర్కిల్: విద్యుత్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కామనూరు శ్రీనివాసులు రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో విద్యుత్ ఉద్యోగుల ఉద్యమనేత కిరణ్ 4వ వర్ధంతి సంస్మరణ సభ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూల మాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సురేంద్రబాబు, నందీశ్వర్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సమ్మర్ క్యాంపు పోస్టర్ల ఆవిష్కరణ



పులివెందులలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు, తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక వైఎస్ రాజారెడ్డి ఆసుపత్రి సమీపంలో ఉన్న గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆదివారం వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులకు నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కృష్ణమోహన్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ బాబు, ఉపాధ్యాయులు, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి విజ్ఞాన శిబిరాలు

లింగాల : స్థానిక గ్రంథాలయంలో ఈనెల 8వ తేదీ నుంచి జూన్ 11వ తేదీవరకు విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తున్నామని గ్రంథాలయ అధికారిణి జయమ్మ తెలిపారు. ఆదివారం లింగాలలో సమ్మర్ క్యాంపు బ్యానర్లు, కరపత్రాలు, గోడ పత్రాలతో ఆమె విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక బస్టాండులో మానవ హారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవి సెలవుల్లో గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లింగాల సింగిల్ విండో అధ్యక్షుడు ఎ.వి.శ్రీనివాసరెడ్డి, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



పూర్వ విద్యార్థులు

సింహాద్రిపురం : మండలంలోని కోవరంగుంటపల్లె గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 1988–89 బ్యాచ్ విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులు మాట్లాడుతూ చాలా ఏళ్లుగా పాఠశాలలో చదివిన విద్యార్థులందరూ కలుసుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పూర్వపు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

దూదేకుల సంఘానికి స్థలం మంజూరు చేయాలి

కడప కార్పొరేషన్: దూదేకుల సంఘానికి స్థలం కేటాయించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. బాదుల్లా కోరారు. ఆదివారం డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, కడప మేయర్ కె. సురేష్ బాబులకు వినతి పత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో దూదేకుల సోదరులు 1.50 లక్షల మంది ఉన్నారని, వారికి జిల్లా కేంద్రంలో కమ్యునిటీ హాల్, కబరస్థాన్‌కు స్థలం మంజూరు చేయాలన్నారు. దీనిపై వెంటనే స్పందించిన వారు కలెక్టర్, కడప తహసీల్దార్‌లకు ఫోన్ చేసి మంజూరుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర నాయకులు పి. ఓబులేసు, జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయప్ప, అలీబాషా, ఖాదరయ్య, సుభాన్, బాబయ్య, దస్తగిరి, రహీం, పీరమ్మ, రెడ్డెయ్య పాల్గొన్నారు.

వర్షాలతో రైతులు అప్రమత్తంగా ఉండాలి

అట్లూరు : అకాల వర్షాలతో పండ్లతోటల రైతులు అప్రమత్తంగా ఉండాలని ఉద్యానశాఖ అధికారి జయభరత్‌రెడ్డి తెలిపారు.

ముఖ్యంగా బద్వేలు ఉద్యాన డివిజన్ పరిధిలోని సిద్ధవటం, అట్లూరు, గోపవరం మండలాలలో ఉన్న చీనీ, మామిడి, నిమ్మ రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. మామిడి కోత దశలో ఉన్నందున త్వరితగతిన కాయలను విక్రయించు కోవాలన్నారు. అలాగే 10 నుంచి 15 రోజులలో కోతకు వచ్చే చెట్లపై పోటాషియం నైట్రేట్+బోరాక్స్ ఉద్యాన అధికారుల సిఫార్సు మేరకు పిచికారీ చేసుకోవాలన్నారు. వర్షాల అనంతరం కూడా ఉద్యాన అధికారుల సలహాలు సూచనల మేరకు మందులు వాడాలన్నారు.

నిరుపేదలకు బాసటగా వడుగుల కార్యక్రమం



కిట్స్‌ను పంపిణీ చేస్తున్న పీఠాధిపతి

జమ్మలమడుగు : ప్రతి నిరుపేద ముస్లింలకు బాసటగా నిలవాలనే లక్ష్యంతోనే ఖత్నా(వడుగుల) కార్యక్రమాన్ని నిర్వహించామని ఆస్థానయే జామియా మసీదు పీఠాధిపతి సయ్యద్‌షా సాదిక్‌పాషా ఖాద్రీ తెలిపారు. ఆదివారం ఉదయం గూడుమస్తాన్ దర్గా సమీపంలో ఉన్న రహమానియా దారుల్ ఉలూం ఆధ్వర్యంలో ఖత్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఖత్నా చేయించుకున్న పిల్లలకు నిత్యావసర వస్తువుల కిట్స్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సయ్యద్‌షా యింపాషాఖాద్రీ, మోసిన్‌పాషాఖాద్రీ, తహసీన్ పాషాఖాద్రీ, ముల్లాజానీ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి రోప్ జంప్ పోటీలకు ఎంపిక



గోల్డ్ మెడల్ సాధించిన షఫియ

దువ్వూరు : మండల పరిధిలోని పుల్లారెడ్డిపేట కస్తూర్బాగాంధీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు సయ్యద్ షఫియా, నిహారిక జాతీయ స్థాయి రోప్ జంప్ పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల ప్రత్యేక అధికారి మల్లేశ్వరి ఆదివారం తెలిపారు. ఈనెల 2, 3 తేదీల్లో నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలోని భారతి విద్యా మందిరంలో స్కూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో షఫియ గోల్డ్, నిహారిక సిల్వర్ మెడల్స్ సాధించారన్నారు. ఈనెల 20న మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో జరిగే జాతీయ స్థాయి జంప్ రోప్ పోటీల్లో పాల్గొంటారని ఆమె తెలిపారు. ఎంపికైన విద్యార్థినులను పీఈటీ రమణమ్మ, ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ప్రతిభ

జమ్మలమడుగు : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు కార్పొరేట్ స్థాయి విద్యార్థులతో పోటిపడి ఉత్తమ ఫలితాలను సాధించారు. మార్కుల్లో 580 పైగా సాధించి చరిత్ర సృష్టించారు. మైలవరం రెసిడెన్సియల్ పాఠశాలలో వందశాతం ఫలితాలు సాధించారు. మండల పరిధిలోని మొత్తం 13 పాఠశాలల్లో మొత్తం 601 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా అందులో 512 మంది ఉత్తీర్ణత సాధించారు. అత్యధికంగా మార్కులు సాధించిన పాఠశాల జాబితాలలో పతంగేరామన్నరావు ఉన్నతపాఠశాల, బాలికల ఉన్నతపాఠశాల విద్యార్థులు నిలిచారు. పీఆర్ పాఠశాలనుంచి ఎల్.వరుణ్‌బాబు 583 మార్కులు సాధించగా, బాలికల ఉన్నతపాఠశాల నుంచి జ్యోత్స్న 582, గౌరిదీప 581 సాధించి రికార్డు సాధించారు.

ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థుల ప్రతిభ

జమ్మలమడుగు పట్టణంలోని మిఠాయిగిరి వీధిలో ఉన్న ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులు పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ చాటి 100% ఉత్తీర్ణత సాధించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దాయిపులే చంద్రశేఖరరావు అభినందించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో 13 మంది విద్యార్థులు పరీక్ష రాయగా అందులో ఎనిమిది మంది విద్యార్థులకు 500కు పైగా మార్కులు వచ్చాయని విద్యార్థులంతా ఫస్ట్ క్లాస్ లో ఉత్తీర్ణత సాధించారని తెలియజేశారు. అత్యధికంగా షేక్ షఫియా 549 మార్కులతోనూ షేక్ మాబుచాన్ 545 మార్కులతోనూ అగ్రస్థానంలో నిలిచారు. గత సంవత్సరం కూడా 100% మార్కులతో అగ్రస్థానంలో నిలిచిందని రెండు ట్రిబుల్ ఐటీ సీట్లను కైవసం చేసుకున్నదని ఆయన తెలిపారు.

రెసిడెన్సియల్‌లో వందశాతం ఫలితాలు

మైలవరం బాలికల గురుకుల పాఠశాలలో ఈ ఏడాది వందశాతం ఫలితాలను సాధించడంతో పాటు ముగ్గురు బాలికలకు అత్యధిక మార్కులు సాధించిన జాబితాలో నిలిచారు. అందులో ఏ.జయప్రద 586 మార్కులు సాధించగా పల్లె నీహారిక 584, యు.కీర్తన 583 మార్కులు సాధించారు. మొత్తం 77 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా వందశాతం మంది బాలికలు మొదటిశ్రేణిలో పాసైన జాబితాలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ ప్రభావతి తెలిపారు.

ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

వల్లూరు : గంగాయపల్లెలోని ఏపీ మోడల్ స్కూల్‌కు చెందిన యూ.ముఖేష్ అభినయ్ 563 మార్కులు సాధించి ప్రభుత్వ పాఠశాలల్లో మండల టాపర్‌గా నిలిచారు. ఎర్రగుంట్లకు చెందిన ఇతని తండ్రి వెంకటసుబ్బారావు జువారి సిమెంట్ పరిశ్రమలో కాంట్రాక్టర్‌గా పనిచేస్తుండగా, తల్లి సుజాత గృహిణి. పాఠశాలకు చెందిన శూలం లక్ష్మి 560 మార్కులు సాధించింది. వల్లూరు మండలంలోని సీతోరుపల్లెకు చెందిన ఈమె తండ్రి సుబ్బరాయుడు కూలీ కాగా, తల్లి గంగాదేవి గృహిణి. పాఠశాలకు చెందిన కే సాయిలక్ష్మి 556 మార్కులు సాధించింది. కమలాపురం మండలంలోని చదిపిరాల్లకు చెందిన ఈమె తండ్రి కే రామలింగారెడ్డి వల్లూరు మండలంలోని ఉపాధి హామీ కార్యాలయంలో ఉద్యోగి కాగా , తల్లి ప్రశాంతి గృహిణి. పాఠశాలకు చెందిన తుంగా పల్లవి 554 మార్కులు, షేక్ రయ్యాన్ అహమ్మద్ 545 మార్కులు, ఉల్చా గిరివర్ధన్ 545 మార్కులు, చింతా జోగ్గారి సాహితీ రెడ్డి 529 మార్కులు, ఆది జాన్ వెస్లీ 522 మార్కులు, రాజోలు సౌమ్య 521 మార్కులు, వై అనునయ్ అశ్వర్థ్ కుమార్ 520 మార్కులు, ఎన్.దివ్యసాయి 516 మార్కులు, ఆర్ యోగ పవిత్ర 514 మార్కులు, కోలా యశ్వంత్ 514 మార్కులు, పీ వెంకటసుజన 514 మార్కులు, మామిళ్ల నాగ కీర్తి 512 మార్కులు, పూజల నిత్య శ్రీ 510 మార్కులు సాధించారు. ఈ మేరకు ఎంఈవో లిల్లెమ్మ, పాఠశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు. వల్లూరు జడ్పీ హైస్కూలుకు చెందిన రమ్యాంజలి 549 మార్కులు, బీ పూజిత 546 మార్కులు, గురు ప్రియ 511 మార్కులు సాధించారు. వల్లూరు కేజీబీవీకి చెందిన వీ రోహిణి 533 మార్కులు సాధించింది.

పులివెందుల : పట్టణంలోని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని అఖిల మంచి ప్రతిభ కనబరిచింది. పట్టణంలోని ముద్దనూరు రోడ్డు జయమ్మ కాలనీలో నివాసముంటున్న తల్లిదండ్రులు ఇస్మాయిల్, హబీబ్‌ల కుమార్తె పి.అఖిల పదవ తరగతి ఫలితాలలో 507మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలిచింది. పాఠశాల హెచ్‌ఎంతోపాటు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కమనీయం.. ఎల్లమ్మ కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితుడు

కడప కల్చరల్ : నగరంలోని 48వ డివిజన్ ఆచార్ల కాలనీలో శ్రీ రేణుకా ఎల్లమ్మ, జమదగ్ని మహర్షిల కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఏటా జరిగే జాతర మహోత్సవంలో భాగంగా ఈ ఏడాది ఆదివారం ఈ కార్యక్రమం చేపట్టారు. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కు విశేష పూజలు చేసి, ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం స్వామి, అమ్మవారి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి, పీఠంపై ఆశీనులను చేశారు. వేదపండితులు మంత్రోచ్చారణతో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. ఆచార్ల కాలనీ, ఏఎస్ఆర్ నగర్, రామచంద్రారెడ్డి నగర్‌లతోపాటు కాలనీల ప్రజలు వచ్చి, కనులారా వీక్షించి ఆనంద పరవశం చెందారు. ఈ కార్యక్రమంలో కృష్ణమాచారిలు పాల్గొన్నారు.

10న వేలంపాట

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ఆర్టీసీ బస్టాండ్ పరిధిలో ఉన్న 25 చెట్లను కొట్టుకుని తీసుకునిపోయేందుకు బహిరంగ వేలం వేస్తున్నామని, ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలని డిపో మేనేజర్ ఎ.మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 10న ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ బహిరంగ వేలంలో పాల్గొనదల్చిన వారు రూ.20వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. దాదాపు 20 – 25 టన్నుల వరకు గల చెట్లను వేలం వేస్తామని, పాట దక్కించుకున్న వారు వెంటనే డబ్బు చెల్లించాల్సి ఉంటుందన్నారు.

